క్లుప్తంగా

బీజేపీకి అధికారం ఖాయం
పార్టీ జిల్లా అధికారి ప్రతినిధి వీరయ్య



కడ్తాల్‌లో బైక్ ర్యాలీ

కడ్తాల్: రాష్ట్రంలో బీజేపీ అధికారంలో రావడం ఖాయమని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఎ.వీరయ్య అన్నారు. ఆమనగల్లులో విజయ సంకల్ప సభను పురస్కరించుకుని మంగళ వారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అలాగే.. గోవిందాయిపల్లి తండా గేటు వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందన్నారు. నియంత పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌కు వచ్చే ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. మోదీ సారథ్యంలోని బీజేపీ ప్రభుత్వం దేశంలో అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. దేశ సంక్షేమం, అన్ని వర్గాల వారికి సముచిత స్థానం కేవలం బీజేపీతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మాన్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణ్ చెరువు పరిశీలన
యాచారం: తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 8న చెరువుల పండుగను పురస్కరించుకుని మంగళవారం అధికారుల బృందం చింతపట్లలోని లక్ష్మణ్ చెరువును పరిశీలించారు. చింతపట్ల లక్ష్మణ్ చెరువు వద్ద పండుగను జరుపుకోవడానికి నిర్ణయించారు. ఈ నేపథ్యంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, ఉప తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, మండల పంచాయతీ అధికారి ఉమారాణి పాల్గొన్నారు.

వైఎస్సార్‌టీపీతోనే రాజన్న రాజ్యం
నియోజకవర్గ ఇన్‌చార్జి అర్జున్‌రెడ్డి



వైఎస్సార్‌టీపీలో చేరిన గిరిజన నాయకులు

కడ్తాల్: అభివృద్ధి, సంక్షేమంతో కూడిన రాజన్న రాజ్యం రావాలంటే వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు షర్మిలతోనే సాధ్యమని కల్వకుర్తి వైఎస్సార్ టీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అర్జున్‌రెడ్డి అన్నారు. మంగళవారం కడ్తాల్ మండలం అన్మాస్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని పుల్లేరుబోడ్‌తండాకు చెందిన బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకి చెందిన మహిళలు, యువకులు.. హనుమంతు, లక్ష్మన్, నవీన్, హర్యా, మహేశ్, రమేశ్, కిరణ్, భీక్యా, రాజు, శ్రీను, లక్ష్మీ, కమ్లీ, స్వప్న, మంజుల, శారద, శాంతి తదితరులు అర్జున్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌టీపీలో చేరారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు నరేశ్‌గౌడ్, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, మండల ఉపాధ్యక్షుడు రమేశ్‌నాయక్, శివ, సాయి, రాకేశ్‌రెడ్డి ఉన్నారు.

తక్కళ్లపల్లిలో గడ్డివాము దగ్ధం
యాచారం: మండల పరిధిలోని తక్కళ్లపల్లి గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు ఓ రైతుకు చెందిన గడ్డివామును దగ్ధం చేశారు. వివరాలు... గ్రామానికి చెందిన మదనాపురం నర్సింహా వ్యవసాయ క్షేత్రం వద్ద సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు దాదాపు రూ.50 వేల విలువ జేసే గడ్డివాముకు నిప్పంటించారు. ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్ తలారి మల్లేశ్ సంఘటనా స్థలానికి వెళ్లి రైతును పరామర్శించారు. ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. గడ్డివాము దగ్ధంపై నర్సింహా పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత
కడ్తాల్: నిరుపేదలకు సీఎం రిలీఫ్‌ఫండ్ పథకం వరమని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు.మండలానికి చెందిన శ్రావణికి రూ.11 వేలు, లక్ష్మమ్మకు రూ.22 వేలు, శ్రీకాంత్‌రెడ్డికి రూ.18 వేలు, సత్తయ్యకు రూ.56 వేలు సీఎం ఆర్ఎఫ్ చెక్కులు మంజూరయ్యాయి.మంగళవారం ఎమ్మెల్సీ నివాసంలో బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్సీ చెక్కులను అందించారు. సురేందర్‌రెడ్డి, స్థానిక నాయకులు ఉన్నారు.

కానిస్టేబుళ్లకు సన్మానం



విఠలయ్యగౌడ్, పద్మను సన్మానించిన తోటి ఉద్యోగులు

తలకొండపల్లి: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న హెడ్‌కానిస్టేబుళ్లు విఠలయ్య గౌడ్, పద్మను తోటి ఉద్యోగులు సోమవారం రాత్రి ఘనంగా సన్మానించారు. వీరివురు విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి ప్రజలకు ఉత్తమ సేవలు అందించేవారని ప్రశంసించారు. విఠలయ్యగౌడ్.. జీనం వ్యాలీ, పద్మ.. శంషాబాద్ పోలీసు స్టేషన్‌కు బదిలీ అయినట్లు ఎస్ఐ వెంకటేశ్‌యాదవ్ మంగళవారం తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల సుడిలో జీవీఆర్ కాలనీ

అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ లేక అవస్థలు

- సీసీ రోడ్లు లేక వాహనదారుల ఇక్కట్లు
- వర్షం వస్తే కాలనీ అంతా జలమయం
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



ఔట్‌లెట్ లేక వరద కాలువలో కలుస్తున్న మురుగు

హయత్‌నగర్: పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ తట్టిఅన్నారంలో గల జీవీఆర్ కాలనీలోలో సమస్యలు తిష్ట వేశాయి. కాలనీ ఏర్పడి పదిహేనేళ్లు గడుస్తున్నా కనీస సౌకర్యాలు లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. తట్టిఅన్నారంలో జీవీఆర్ కాలనీ 2008లో ఏర్పడింది. అప్పటి నుంచి క్రమంగా ఇండ్ల నిర్మాణాలు పెరుగుతూ వస్తున్నాయి. ప్రస్తుతం ఈ కాలనీలో సుమారు 250 ఇళ్ల వరకు ఉన్నాయి. రోజురోజుకు జనాభా పెరుగుతున్నా సౌకర్యాలు కల్పించడంలో మున్సిపల్ అధికారులు విఫలం అవుతున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఔట్‌లెట్ లేక ఇబ్బందులు..

కాలనీలో కొంతమేర అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం చేపట్టినప్పటికీ మురుగు నీరు బయటికి వెళ్లే దారిలేకపోవడంతో కాలనీవాసులు డ్రైనేజీని వాడకుండా పైపులను మూసివేశారు. కొంత డ్రైనేజీరు కింది చెరువు వరద కాలువలోకి వెళ్తుంది. దీంతో వరద కాలువ మురికికాలువగా మారింది.

వర్షం వచ్చిందంటే..

కాలనీ చెరువుకు దిగువన లోతట్టు ప్రాంతంలో ఉండటంతో వర్షం వచ్చిందంటే కాలనీలోని ప్రధాన వీధులన్నీ జలమయం అవుతున్నాయి. వర్షాకాలంలో ఒక్కోసారి ఇళ్లలోనుంచి బయటికి వెళ్లలేని పరిస్థితి ఏర్పడతుండని కాలనీవాసులు తెలిపారు. కాలనీలో ప్రధాన రహదారితో పాటు అంతర్గత రోడ్లు మట్టితో గుంతల మయంగా మారాయి. సీసీరోడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం వచ్చిందంటే మట్టి రోడ్లు చిత్తడిగా మారి వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.మున్సిపాలిటీకి సక్రమంగా పన్నులు కడుతున్నా సౌకర్యాలు కల్పించడంలో అధికారులు వివక్ష చూపుతున్నారని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. వెంటనే సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలి



కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎమ్మెల్యేతో పాటు మున్సిపాలిటీ అధికారులను పలుమార్లు కలిసి వినతిపత్రాలు అందించాం. అయినప్పటికీ ఎలాంటి ఫలితం లేదు. కాలనీ అంతటా అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలి. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలి.

– రామ్మోహన్‌రావు, జీవీఆర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు



బస్తీ దవాఖాన ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

బస్తీ దవాఖానలతో పేదల చెంతకు వైద్యం

- ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

హయత్‌నగర్: పేదల ప్రజలకు వైద్యం అందుబాటులో ఉండాలనే లక్ష్యంతోనే బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేస్తున్నామని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి అన్నారు. పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ కుంట్లూర్‌లో, తుర్కయాంజాల్ మున్సిపాలిటీ మునుగనూరులో మంగళవారం బస్తీ దవాఖానాలను, మహిళా భవన్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... బస్తీ దవఖానాల్లో మెరుగైన వైద్యంతో పాటు అవసరమైన మందులు ఇస్తారని, వైద్య పరీక్షలు చేయిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా మున్సిపాలిటీల చైర్‌పర్సన్లు అనూరాధ, స్వప్న, వైస్ చైర్‌పర్సన్లు.. హరిత, సంపూర్ణారెడ్డి, జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, డీసీసీబీ వైస్ చైర్మన్ సత్తయ్య, డీఎంహెచ్ఓ వెంకటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల పాఠశాలలో దరఖాస్తుల ఆహ్వానం

హయత్‌నగర్: దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న హయత్‌నగర్‌లోని షేకీనా ఫౌండేషన్ పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరంలో చేరేందుకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ చింతల ఇషాకర్ తెలిపారు. మానసిక వైకల్యం, ఆటిజం తదితర సమస్యలతో బాధపడుతున్న 5 నుంచి 18 ఏళ్ల లోపు బాలబాలికలు ఈ పాఠశాలలో చేరేందుకు అర్హులన్నారు. ఎంపికైన విద్యార్థులకు ప్రత్యేక విద్యతో పాటు స్పీచ్ థెరపీ, బిహేవియర్ మోడిఫికేషన్ థెరపీలో నిపుణులైన ఉపాధ్యాయులతో శిక్షణ ఇప్పిస్తామన్నారు. ఆసక్తి గలవారు డాక్టర్ సర్టిఫికెట్, ఆధార్, మూడు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో హయత్ నగర్ డిఫెన్స్ కాలనీలో షెకీనా ఫౌండేషన్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నం. 9848156468కు కాల్ చేయాలన్నారు.

బ్రిజ్‌భూషణ్‌పై చర్యలు తీసుకోవాలి



రెజ్లర్లకు మద్దతుగా దీక్ష చేపట్టిన అనురాధ, నాయకులు

- జెడ్పీటీసీ అనురాధ
- మహిళా రెజ్లర్లకు మద్దతుగా బీఆర్ఎస్ నేతల ఒకరోజు దీక్ష

కడ్తాల్: మహిళా రెజ్లర్లను లైంగిక వేధింపులకు గురి చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ చరణ్‌సింగ్‌పై చర్యలు తీసుకోవాలని ఆమనగల్లు జెడ్పీటీసీ సభ్యురాలు అనురాధ డిమాండ్ చేశారు. ఆమనగల్లు పట్టణంలో మంగళవారం మహిళా రెజ్లర్లకు మద్దతుగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఒకరోజు నిరాహారదీక్ష చేపట్టారు. ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ దీక్షకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా అనురాధ మాట్లాడుతూ..బేటీ బచావో బేటీ పడావో అంటూ ప్రచారం కొనసాగించే బీజేపీ ప్రభు త్వం మహిళలపై వేధింపులకు పాల్పడిన ఎంపీపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న బీజేపీ ఎంపీపై వెంటనే ప్రధాని చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళా రెజ్లర్లకు బీఆర్ఎస్ మద్దతు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అర్జున్‌రావు, మున్సిపల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పత్యానాయక్, గ్రంథాలయ సంస్థ జిల్లా డైరెక్టర్ రాధమ్మ, నాయకులు జయమ్మ, కల్యాణి, సరిత, మల్లమ్మ, రామకృష్ణ, వెంకట్‌రెడ్డి, కుమార్, ఖలీల్, గణేశ్, యాదగిరి, ఆనంద్, రంజిత్, శేఖర్ ఉన్నారు.

పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించండి

- బడిబాటలో తల్లిదండ్రులకు అవగాహన



గిరిజన తండాలో బడిబాటలో ఉపాధ్యాయులు

మంచాల: బడీడు పిల్లలను తప్పక ప్రభుత్వ బడిలో చేర్పించాలని వెంకటేశ్వర తండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జావేద్ అన్నారు. మంగళవారం వెంకటేశ్వర తండాలో నిర్వహించిన బడిబాటలో భాగంగా ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పాఠశాలలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంజాపూర్‌లో బడిబాట..

తుర్కయంజాల్: బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని ఇంజాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిల్మానాయక్ అన్నారు. మంగళవారం ఇంజాపూర్‌లో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ఏడాది ప్రాథమిక పాఠశాల నుంచి 73 మంది విద్యార్థుల జాబితాను ఉన్నత పాఠశాలకు అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. ర్యాలీ నిర్వహించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయులు రమేష్ నాయక్, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్లు కృష్ణగౌడ్, నర్సింహగౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గెలుపోటములను సమానంగా స్వీకరించండి



బహుమతులు అందజేస్తున్న శ్రీనివాస్‌గౌడ్, నాయకులు

- పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్

కడ్తాల్: గెలుపోటములను సమానంగా స్వీకరించాలని పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ క్రీడాకారులకు సూచించారు. మండల పరిధిలోని మైసిగండి గ్రామంలో నిర్వహించిన ఎంపీఎల్ క్రికెట్ పోటీలు మంగళవారం ముగిశాయి. ఈ మేరకు బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్ హాజరై.. సొంతంగా క్రీడాకారులకు రూ.20 వేల విలువ గల క్రికెట్ కిట్ అందజేశారు. అనంతరం విజేతగా నిలిచిన ఎస్టార్ అరుణ్ జట్టుకు స్థానిక నాయకులు భాస్కర్‌నాయక్ సమకూర్చిన రూ.30 వేల నగదుతోపాటు ట్రోఫీని, రన్నరప్‌గా నిలచిన రక్షిత్ కమాండర్ జట్టుకు.. స్థానిక సర్పంచ్ తులసీరాంనాయక్ సమకూర్చిన రూ.21వేల నగదుతో పాటు ట్రోఫీని ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తులసీరాంనాయక్, భాస్కర్‌నాయక్, అరుణ్‌కుమార్, హీరాసింగ్, స్టాలిన్ కిషన్, లచ్య, రవి, తులసీరాం, రవి, దాస్లా, మురళి, చందు చందన్, విక్రమ్, సీతారాం, అనిల్, రాజశేఖర్, సుధీర్, వినోద్ తదితరులు ఉన్నారు.

నాగర్‌కర్నూల్‌కు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు

కడ్తాల్: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో సీఎం కేసీఆర్ బహిరంగ సభకు మంగళవారం మండల కేంద్రం నుంచి బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. పార్టీ మండల అధ్యక్షుడు కంబాల పరమేశ్ ఆధ్వర్యంలో కడ్తాల్‌లో ర్యాలీ నిర్వహించి వాహనాల్లో నాగర్‌కర్నూల్‌తరలివెళ్లారు. బీఆర్ఎస్‌కు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్‌గుప్త, సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, ఎంపీటీసీలు లచ్చిరామ్‌నాయక్, చంద్రమౌళి, రైతుబంధు మండల అధ్యక్షుడు వీరయ్య, ఉప సర్పంచ్ వినోద్, నాయకులు సాయికుమార్, మహేశ్,సాయిలు, ఇర్షాద్, కృష్ణ, శ్రీను, ప్రవీన్, యాదయ్య ఉన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న పరమేశ్

అభివృద్ధిలో అందరూ కలిసిరావాలి

ఎంపీపీ జ్యోతి, జెడ్పీటీసీ జంగారెడ్డి



అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న నాయకులు

కందుకూరు: కందుకూరు మండల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తున్నామని ఎంపీపీ మంద జ్యోతి, జెడ్పీటీసీ సభ్యుడు జంగారెడ్డి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని కొత్తగూడలో సర్పంచ్ మల్లారెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు జ్యోతి ఆధ్వర్యంలో జెడ్పీ నిధులు రూ.9 లక్షలు, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.3లక్షలతో భూగర్భడ్రైనేజీ నిర్మాణ పనులకు వారు శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో పాటు మంత్రి సబితారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి ప్రత్యేక చొరవతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. అభివృద్ధిలో అందరూ కలిసిరావాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ శమంతప్రభాకర్‌రెడ్డి, ఉప సర్పంచ్ పద్మమ్మ, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ యాదయ్య, కోఆప్షన్ సభ్యుడు బాల్‌రెడ్డి, వార్డుసభ్యులు హన్మంత్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, మహేందర్, చెన్నకృష్ణ, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, పాండు, దీక్షిత్ రెడ్డి, కార్తీక్, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

కంటివెలుగు శిబిరం..

అంతకుముందు కొత్తగూడలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ మల్లారెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు జ్యోతి ఆధ్వర్యంలో ఎంపీపీ జ్యోతి, జెడ్పీటీసీ జంగారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ రవీందర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రెండురోజుల పాటు సాగునీటి దినోత్సవం
ఇబ్రహీంపట్నం: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నీటి పారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో బుధ, గురువారాల్లో సాగునీటి దినోత్సవం, ఊరూరా చెరువుల పండుగ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఇబ్రహీంపట్నం ఇన్‌చార్జి ఎంపీడీఓ క్రాంతికిరణ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాగునీటి దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం ఉదయం 10 గంటలకు స్థానిక వైష్ణవి ఫంక్షన్ హాల్‌లో సమావేశాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు. అన్ని గ్రామాల్లోని చెరువుల వద్ద చెరువుల పండుగ నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

కల్వకుర్తిలో బీజేపీ జెండా ఎగురవేస్తాం
బీజేవైఎం నియోజకవర్గ కన్వీనర్ అనిల్

తలకొండపల్లి: ప్రజలు మార్పును కోరుకుంటున్నారని వచ్చే ఎన్నికల్లో బీజేపీ సీనియర్ నేత ఆచారి నాయకత్వంలో కల్వకుర్తిలో బీజేపీ జెండా ఎగురవేస్తామని బీజేవైఎం నియోజకవర్గ కన్వీనర్, ఉప సర్పంచ్ అనిల్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం బీజేపీ నాయకులు ఆచారి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి స్వీట్లు పంచారు.

'బీసీలకు 50శాతం సీట్లు కేటాయించాలి'
తలకొండపల్లి: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీసీలకు అన్ని రాజకీయ పార్టీలు 50శాతం సీట్లు కేటాయించాలని గౌడసంఘం కల్వకుర్తి నియోజకవర్గ కన్వీనర్ మొక్కురాల అశోక్‌గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం తలకొండపల్లిలో ఆయన మాట్లాడుతూ.. సమాజంలో 50శాతానికి పైగా ఉన్న బీసీలకు చట్టసభల్లో అవకాశం రాకుండా కొన్ని రాజకీయ పార్టీలు కుట్రలు పన్నుతున్నాయని మండిపడ్డారు. 50 శాతం సీట్లు కేటాయించిన పార్టీకే బీసీలు మద్దతుగా నిలవాలని ఆయన కోరారు.

ఎన్నికల నిర్వహణకు అడ్‌హక్ కమిటీ ఏర్పాటు
వనస్థలిపురం: వనస్థలిపురం నివాసుల సంక్షేమ సంఘం ఎన్నికల నిర్వహణ కోసం అడ్‌హక్ కమిటీని ఎన్నుకున్నారు. ప్రస్తుత కమిటీ కాలపరిమితి ముగియడంతో నూతన కమిటీని ఎన్నుకొనేందుకు అడ్‌హక్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 30 వరకు కాలనీ నివాసుల సభ్యత్వాన్ని పూర్తిచేసి ఎన్నికలు నిర్వహించనున్నారు. సభ్యత్వం తీసుకోదలచిన వారు ఫోన్ నం. 9399396222, 9177608134లో సంప్రదించాలని కమిటీ సభ్యులు కోరారు.

ఎస్‌బీఐ మేనేజర్ సురేష్‌కు సత్కారం



మేనేజర్ సురేష్‌ను సన్మానిస్తున్న నాయకులు, సిబ్బంది

ఇబ్రహీంపట్నం: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇబ్రహీంపట్నం బ్రాంచ్ మేనేజర్ సురేష్ బదిలీ అయ్యారు. హుస్సేనీ ఆలం బ్రాంచ్‌కు బదిలీపై వెళ్తున్న సురేష్ ఇక్కడ సుమారు మూడు సంవత్సరాల పాటు పనిచేశారు. రూ.కోటి 60 లక్షల లాభాల్లో ఉన్న బ్యాంక్‌ను ఆయన రూ.5కోట్ల 80 లక్షల వరకు తీసుకెళ్లి హైయెస్ట్ రేటింగ్‌ను అందించి ఉన్నతాధికారుల ప్రశంసలను పొందారు. ఖాతాదారులకు చేసిన సేవలను గుర్తించి పీఆర్టీయూ మండల అధ్యక్షుడు పరమేశ్, బ్యాంకు సిబ్బంది తదితరులు బదిలీపై వెళ్తున్న సురేష్‌ను మంగళవారం ఘనంగా సత్కరించారు. కాగా ఆయన స్థానంలో కొత్త మేనేజర్‌గా అజయ్‌కుమార్‌సింగ్ రానున్నారు.

సుధీర్‌రెడ్డిని ఓడిస్తాం: కాంగ్రెస్ నేత దర్పెల్లి

హస్తినాపురం: వచ్చే ఎన్నికల్లో ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని లక్ష ఓట్లతో ఓడిస్తామని జీహెచ్ఎంసీ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్‌లీడర్, లింగోజిగూడ కార్పొరేటర్ దర్పెల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. హస్తినాపురం డివిజన్‌లోని తన నివాసంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అధికారికంగా నిర్వహిస్తున్న విద్యుత్ ప్రగతి కార్యక్రమ సభావేదికపై బీఆర్ఎస్ నేతలు ఎలా కూర్చుంటారని ప్రశ్నించినందుకు ఎమ్మెల్యే తన అనుచరులతో భౌతిక దాడి చేయించాడని ఆరోపించారు. సుధీర్‌రెడ్డి అవివేకమే ఆయన ఓటమికి కారణమవుతుందని, ఓటుతో కొడితే ఆయన మలక్‌పేటకు పారిపోవడం ఖాయమన్నారు. 23 ఏళ్లుగా ఆయన వెంట తమ్ముడిగా ఉండి పని చేశానని, తన తండ్రితో కూడా ఏనాడు దెబ్బలు తినని తనను ఎమ్మెల్యే తన అనుచరులతో కొట్టించాడని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో బీఆర్ఎస్ నేత ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ సామ రమణారెడ్డి, సామ రంగారెడ్డి, వజీర్ ప్రకాష్‌గౌడ్, మాజీ మంత్రిపై సుధీర్‌రెడ్డి దాడులు చేయించింది నిజం కాదా.. అని ప్రశ్నించారు. ప్రతిపక్షాలపై దాడులు చేస్తే ముడుచుకుని కుర్చునే ప్రసక్తే లేదని, తగిన విధంగా బుద్ధి చెబుతామని హెచ్చరించారు. రాజశేఖర్‌రెడ్డి వెంట ఉండి పని చేస్తున్నందుకు ముందస్తు ప్రణాళికతో తనపై కూడా దాడి చేశారని ప్రవీణ్‌రెడ్డి ఆరోపించారు. సమావేశంలో నేతలు మల్లారపు శ్రీనివాస్, శ్రీధర్‌గౌడ్, సుధీర్‌రెడ్డి, యశ్వంత్, రాజు, కరణ్, గౌస్, వినీత్, రంజిత్ ,శ్రీనాథ్, విష్ణు పాల్గొన్నారు.

బీజేపీ గెలిస్తేనే అన్ని వర్గాలకు న్యాయం



కాలనీవాసులతో సమావేశమైన అందెల శ్రీరాములు యాదవ్

అందెల శ్రీరాములు యాదవ్

బడంగ్‌పేట్: మహేశ్వరం నియోజకవర్గాన్ని మంత్రి సబితారెడ్డి కబంధ హస్తాల నుంచి విముక్తి చేసిన రోజే స్థానికులకు కొలువులు, కాలనీవాసుల గోసలు, పల్లెవాసుల తిప్పలు తీరుతాయని బీజేపీ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్ ధ్వజమెత్తారు. మంగళవారం బడంగ్‌పేట కార్పొరేషన్‌లోని గుర్రంగూడలో పలు కాలనీవాసులతో కలిసి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ అధికారంలోకి రాగానే మౌలిక వసతులకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తామని అన్నారు. ఒక్క అవకాశం బీజేపీకి ఇవ్వాలని కోరారు. జన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా ప్రధానమంత్రి నరేంద్రమోడీ పథకాలను కాలనీవాసులకు వివరించారు. బీజేపీ గెలిస్తే అన్ని వర్గాలకు, అన్ని రంగాలకు న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్పొరేషన్ అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి, కార్పొరేటర్లు లక్ష్మారెడ్డి, శంకర్, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.